# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**శెనార్తి మీడియా, కరీంనగర్:** :రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. రామడుగు మండలం వెదిర రైతువేదిక ప్రాంగణంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి రూ.2,369 అందిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్నరకాలకు అదనంగా క్వింటాల్కు రూ.500 బోనస్ అందిస్తోందని పేర్కొన్నారు. రైతులు తమ పంటను తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకుని నష్టపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, ప్యాడీ క్లీనర్స్, టార్పాలిన్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. సన్నరకం వడ్లు పండించే రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్గా ఇస్తుందన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. అనంతరం రామడుగు మండలం కొక్కరకుంట, రంగసాయిపల్లె, మోతె, దత్తోజిపేట, శ్రీరాములపల్లి, షానగర్, గంగాధర మండలం హిమ్మత్నగర్, గట్టుభూత్కూర్, చిన్న ఆచంపల్లి, పెద్ద ఆచంపల్లి, గర్శకుర్తి, తాడిజెర్రి, రంగారావుపల్లి, ఉప్పరమల్యాల, కురిక్యాల, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గోపాల్రావుపేట ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, కొక్కెరకుంట, కురిక్యాల పీఏసీఎస్ల చైర్మన్లు ఒంటెల మురళీకృష్ణారెడ్డి, వెలిచాల తిర్మల్రావు, గంగాధర ఏఎంసీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, తహశీల్దార్లు బండి రాజేశ్వరి, అంబటి రజిత, ఎంపీడీవోలు సంగి రాజేశ్వరి, దమ్మని రాము, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, మాజీ వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మీడియాపై దాడులు హేయమైన చర్య

- ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** వరంగల్ జిల్లాలోని నమస్తే తెలంగాణ దిన పత్రిక కార్యాలయంపై కొంతమంది దుండగులు బుధవారం దాడి చేయడాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట జర్నలిస్టుల ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పత్రికలపై మీడియాపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలి అని అన్నారు. అన్యాయాలను నిష్పక్షపాతంగా సమాజానికి అందించే నాలుగవ స్తంభంగా ఉన్న మీడియాపై కక్షసాధింపు చర్యలు దారుణం అని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణిచివేతకు గురిచేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మీడియాపై దాడులకు పాల్పడితే రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టి జర్నలిస్టుల సత్తా చాటుతామని హెచ్చరించారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు పత్రికా కార్యాలయంపై దాడికి కారకులను చట్టపరంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య జర్నలిస్ట్ లు చిట్ల రమేష్, ఉమేష్, రాజు పటేల్, రమేష్ రెడ్డి, రాజు, నరేష్ స్వెన్, రాయలింగు, వెంకటస్వామి, అంబిలపు శ్రీనివాస్, పడాల సంతోష్, పార్వతి సురేష్, పార్వతి రాజేష్, సిద్దార్థ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థలు సేవలో ముందుండాలి

- బోథ్ సీఐ వెంకటేశ్వరరావు
- రోడ్డు ప్రమాదాల నివారణకు ముండ్ల పొదల తొలగింపు



**శెనార్తి మీడియా, బోథ్:** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రహదారికి అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించామని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం బోథ్ మండల కేంద్రం నుండి పొచ్చెర క్రాస్‌రోడ్ వరకు రోడ్డుకి ఇరువైపులా పెరిగిన చెట్లు వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సౌజన్యంతో అటవీశాఖ, ఆర్%ు%బీ, విద్యుత్ శాఖల అధికారులు, సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ సహకారంతో చెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. చెట్ల తొలగింపుకు ఉచితంగా జేసీబీ వాహనం అందించిన చట్ల ఉమేష్‌ను అధికారులు, సొసైటీ సభ్యులు అభినందించారు. బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో అటవీశాఖ బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్, ఎంపీడీఓ రమేష్, ఎస్ఐ శ్రీసాయి, ఆర్&బీ, విద్యుత్ శాఖ సిబ్బంది, సొసైటీ సభ్యులు వెండి పృథ్వి, అబ్దుల్ రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం పోలీస్ స్టేషన్ తనిఖీ

- సీసీటీఎన్ఎస్ వినియోగం, పెండింగ్ కేసుల పరిష్కారంపై సీపీ గౌష్ ఆలం ఆదేశాలు



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం గన్నేరువరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, స్వాధీనం వాహనాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సమన్లు, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య తదితర సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌లో ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టడంతో పాటు స్టేషన్ పరిధి గ్రామాలను సెక్టార్లుగా విభజించి అధికారులను కేటాయించాలని సూచించారు. కొత్త కానిస్టేబుళ్లు సీనియర్ అధికారుల మార్గదర్శకత్వంలో విధులు నిర్వర్తించాలని తెలిపారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీలో ఎస్సై నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**కాంగ్రెస్ ముఖ్య నేతలను కలిసిన ఆత్రం సుశీల**

**శెనార్తి మీడియా, బోథ్:** అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఖానాపూర్ ఎమ్మెల్యే వేద్మ బొజ్జు పటేల్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణలను నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆత్రం సుశీల మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ మండల తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల్లో పార్టీ బలాబలాలపై వారు చర్చించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని నాయకులు సూచించారు. సామాజిక కార్యకర్తగా ఆత్రం సుశీల చేసిన సేవలను పార్టీ గుర్తిస్తుందని, రాబోయే కాలంలో ఆమెకు తగిన గుర్తింపు కల్పిస్తామని నేతలు హామీ ఇచ్చారు.

## వింధ్యావాలీ విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతులు



**శెనార్తి మీడియా, కరీంనగర్:** కరీంనగర్‌లోని మెహర్ నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సంగీత నాట్య పోటీలలో ప్రతిభ చాటారు. హైదరాబాద్ కళాభారతిలో మంగళవారం జరిగిన కళానిలయం కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని బంగారు నంది బహుమతులను సాధించారు. దీపావళి, కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన 'కార్తీక కళామేళ' కార్యక్రమంలో నిహారిక, ఆద్య, ఇషాన్వి, శ్రీమయి సంగీత నాట్య ప్రదర్శనలో విశేష ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్ విద్యార్థుల విజయాన్ని ప్రశంసించారు.
విజేతలను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాష్ రావు, వైస్‌చైర్మన్ రామవరం పృథ్వీరావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** బెజ్జంకి మండల పరిధిలోని ఎంపీపీఎస్ బెజ్జంకి పాఠశాలలో హ్యాండ్‌వాష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సబ్బుతో చేతులు కడగడం ప్రాముఖ్యత, ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేయకపోతే వచ్చే వ్యాధుల గురించి ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు వివరించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని, ప్రతి ఒక్కరూ దీనిని అలవాటు చేసుకోవాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకునే సరైన విధానాన్ని విద్యార్థులకు ప్రదర్శించారు. అలాగే ఆహారం తినేటప్పుడు అయోడైజ్డ్ ఉప్పు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారోజు శంకరాచారి, మంజుల, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గన్నేరువరం మండలంలో గురువారం ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ పలు వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లి, జంగాపల్లి, హనుమాజిపల్లి, గోపాలపూర్, మాదాపూర్ గ్రామాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్ము రవీందర్ రెడ్డి, జువ్వాడి మన్మోహనరావు, పులి కృష్ణ, కృష్ణ మాతంగి, అనిల్, చింతల శ్రీధర్ రెడ్డి, పాకాల పరశురాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్ బాల్ టోర్నమెంట్లో సత్తాచాటిన సరస్వతి స్టూడెంట్



**శెనార్తి మీడియా,రామడుగు:** ఎస్జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-17 హ్యాండ్ బాల్ పోటీల్లో రామడుగు మండలం వెలిచాల సరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థి గంధం విక్కీ సత్తాచాటినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో బుధవారం జరిగిన పోటీల్లో కరీంనగర్? జట్టు తరపున ఆడి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్, పీఈటీ సాయికృష్ణ విక్కీని అభినందించారు.

### జోనల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ బాలికల జట్టుకు మొదటి స్థానం



**శెనార్తి మీడియా, కరీంనగర్:** జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లో ఇటీవల జరిగిన అండర్-14 బాలబాలికల జోనల్ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా బాలికల జట్టు అద్భుత ప్రతిభతో మొదటి స్థానం సాధించింది. ఈ పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుండి పలు జట్లు పాల్గొనగా, కరీంనగర్ పట్టణంలోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ 7వ తరగతి విద్యార్థిని ఎం. విన్మయి వర్మ తన చురుకైన క్రీడాస్ఫూర్తి, సమర్థమైన ఆటతీరుతో జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. విజయంపై పాఠశాల చైర్మన్ కొమరయ్య సౌగాని, మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సౌగాని, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విన్మయి వర్మను అభినందించారు. ఆమె చూపిన కృషి, క్రమశిక్షణ, జట్టు భావన అద్విత పాఠశాల విలువలకు ప్రతీక అని తెలిపారు. పాఠశాల పీఈటీలు, సిబ్బంది విన్మయి వర్మకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో రాష్ట్రస్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### డీజీపీని కలిసిన ఆడే గజేందర్



**శెనార్తి మీడియా, బోథ్:** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన శివధర్ రెడ్డిని బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల్ చారితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

